## అధ్యాయము 44

# అపాయములో బెన్యామీను

యోసేపు తన చిన్న సహోదరుని మరలా చూచుటకు మిక్కిలి సంతోషించెను, కాని ఇతర సహోదరుల యొక్క సమగ్రతను మరియు సంఘీభావాన్ని పరీక్షించుట కొనసాగించెను. అతనికి వ్యతిరేకముగా చేసిన పాపములను తెలిపినా, వారు ఆ సత్యాన్ని గౌరవిస్తారా? ఒకరిని గూర్చి మరియొకరు త్యాగము చేయడానికి సిద్ధపడి, కలిసి నిలిచి యుందురా? బెన్యామీను, యాకోబు యొక్క ఇష్టుడైన కుమారునితో, యోసేపుతో ముందు ప్రవర్తించిన దానికంటే బాగుగా ప్రవర్తించునా?

## వెండి గిన్నె యొక్క సంఘటన (44:1-17)

### పరీక్ష (44:1-5)

**[1]యోసేపు ఆ మనుష్యుల గోనెలు పట్టినంత ఆహార పదార్థములతో వాటిని నింపి ఎవరి రూకలు వారి గోనెమూతిలో పెట్టుమనియు, [2]కనిష్ఠుని గోనె మూతిలో తన వెండి గిన్నెను అతని ధాన్యపు రూకలను పెట్టుమనియు, తన గృహ నిర్వాహకునికి ఆజ్ఞాపింపగా యోసేపు చెప్పిన మాట చొప్పున అతడు చేసెను.**

**[3]తెల్లవారినప్పుడు ఆ మనుష్యులు తమ గాడిదలతో కూడ పంపివేయబడిరి. [4]వారు ఆ పట్టణమునుండి బయలుదేరి యెంతో దూరము వెళ్లక మునుపు, యోసేపు తన గృహనిర్వాహకుని చూచి-నీవు లేచి ఆ మనుష్యుల వెంటబడి వెళ్లి వారిని కలిసికొని-మీరు మేలుకు కీడు చేయనేల? [5]దేనితో నా ప్రభువు పానము చేయునో దేనివలన అతడు శకునములు చూచునో అది యిదే కదా? మీరు దీని చేయుటవలన కాని పని చేసితిరని వారితో చెప్పుమనెను.**

**వచనము 1.** ఆ సహోదరుల చివరి పరీక్ష వారి మొదటి పరీక్ష వలె మొదలైంది, వారు ధాన్యము కొనుక్కోవడానికి ఉపయోగించిన వెండి వారి గోనెలో తిరిగి చేర్చబడెను (42:25). మరలా, యోసేపు **తన గృహ నిర్వాహకునితో ఆ మనష్యుల గోనెలు పట్టినంత ఆహారపదార్థములతో నింపమనెను.** దానికి తోడుగా, **ఎవరి రూకలు వారి గోనె మూతిలో పెట్టుమని** ఆజ్ఞాపించెను.

**వచనము 2.** ఈ సారి, యోసేపు **తన వెండి గిన్నెను అతని ధాన్యపు రూకలను**

**కుడా . . . కనిష్ఠుని యొక్క గోనె మూతిలో నుంచుమని** తన పనివాడితో చెప్పెను. ఆ గృహ నిర్వాహకుడు, "తన యజమాని ఈ హెబ్రీ పురుషుల మీద మరల దొంగతనమును ఎందుకు ఆరోపిస్తున్నాడు? పాలకుని వెండి గిన్నె దొంగతనము అనే తీవ్రమైన నేరములో ఆ కనిష్ఠుడిని ఎందుకు అనుమానిస్తున్నాడు?" అని అలోచించియుండవచ్చు. అయినా, ఆ గృహ నిర్వాహకునికి తన యజమానిని ప్రశ్నించే స్థాయి లేదు; అతని పని తన యజమాని ఇచ్చిన ఆజ్ఞను పాటించడమే, అందువలన **అతడు యోసేపు చెప్పిన మాట చొప్పున చేసెను.**

ఏమి జరుగుతుందో ఆ పనివాడికి తెలియకపోయినా, ప్రభావితం చేసే ఈ వ్యాఖ్యానము, ఈ పరీక్ష పదిమంది సహోదరుల నిజమైన వైఖరి వారి కనిష్ఠ సహోదరుడు బెన్యామీనుపై ఎలా వుందో బయలుపరచడానికని చూపుతుంది. మునుపటిలా యోసేపుకు వ్యతిరేకంగా వారు ఎలా చేసారో అలాగే బెన్యామీనుకు వ్యతిరేకముగా చేస్తారా? యోసేపు వారి సహోదరులపై ఒత్తిడి పెంచి వారి తండ్రికి ఇష్టుడైన: రాహేలు ఆఖరి కొడుకు, బెన్యామీనును అడ్డు తొలగించుకొను అవకాశమును వారికిచ్చుటకు నిర్ణయించెను.

**వచనము 3.** మరుసటి ఉదయము, తెల్లవారినప్పుడు, **ఆ మనుష్యులు తమ గాడిదలతో కుడా** కనానుకు **పంపివేయబడిరి.** అంతా బాగుగా జరుగుచున్నట్లు ఉన్నది; వారి పనిని వారు సక్రమముగా ముగించుకొని సంతోషముతో వారిని వారే అభినందించుకుంటూ అనుమానము లేకుండా ఉన్నారు. మెట్టుకు, ఆకలితో ఉన్న తమ కుటుంబములకు ధాన్యములు గాడిదల నిండా నింపబడి, షిమ్యోను చెరసాల నుండి విడిపింపబడి, మరియు బెన్యామీనుకు ఎటువంటి హాని జరగకుండా సురక్షితముగా త్వరలో వారి తండ్రి యొద్దకు చేరుదురు.

**వచనములు 4, 5. వారు ఆ పట్టణమునుండి బయలుదేరి యెంతో దూరము వెళ్లక మునుపు, యోసేపు తన గృహనిర్వాహకుని చూచి-**నీవు లేచి **ఆ మనుష్యుల వెంటబడి వెళ్లి వారిని కలిసికొని, వారితో చెప్పుము, మీరు మేలుకు కీడు చేయనేల?** (కీర్త. 35:12; 38:20; 109:5; సామెతలు. 17:13 చూడుము). మరియొక మాటలో, అతడు చెప్పాలంటే, "నా యజమాని మీకు విలాసవంతమైన విందు చేసి మరియు అధిక మొత్తములో ధాన్యములనమ్మితే, అతని ఉదారతకు ప్రతిగా మీరు ప్రముఖ వెండి గిన్నెను దొంగిలించిరి." ఆ గృహనిర్వాహకుడు తను ఇలా అడుగుతున్నపుడు, **దేనితో నా ప్రభువు పానము చేయునో దేనివలన అతడు శకునములను చూచునో అది ఇదే కదా?** దానిని గుర్తించివుండవచ్చు. అప్పుడు అతడు వారితో ఇలా అనెను, **మీరు దీని చేయుట వలన కాని పని చేసితిరి.**

నిజానికి, "వెండి గిన్నె" అనునది నిర్దేశించబడినది కాని 4 లేదా 5 వచనముల యొక్క హెబ్రీ పుస్తకములో చెప్పబడలేదు. చాలా ఇంగ్లీషు అనువాదములు (RSV; NRSV; NEB; REB; TEV; CEV; NLT) LXXను అనుసరించును, ఏదైతే ఈ ప్రశ్న కలిగివుంది "నా వెండి గిన్నెను ఎందుకు దొంగిలిరి?"[1]

శకునము చూడడము అనేది పురాతన తూర్పు సమీపములో అన్యజనులకు

ఒక సాధారణ అలవాటు, మరియు వారు ఈ పార్శ్యంశమునకు సంబంధించి భారీ సాహిత్యమును ఉత్పత్తి చేసేవారు.[2] 30:27లో, లాబాను యాకోబును బట్టి యెహోవా నన్ను ఆశీర్వదించెనని శకునము చూచి తెలిసికొంటినని ప్రస్తావించెను. శకునము మరియు అన్యదేవతల మధ్య ఉన్న మూఢ సంబంధమును, ఎందుకు యాకోబుతో ఉన్నవారిలో చాలామంది, రాహేలుతో కలిపి (31:19), అతడు వారి అన్యదేవతలన్నిటిని మస్తకి వృక్షము క్రింద దాచిపెట్టువరకు వారితోనే వుంచుకొనుటను వివరించును (35:4).[3]

ఐగుప్తులో, యోసేపు కాలములో, రాజ్య ఉన్నతాధికారి శకునము చూచు గిన్నెను, రాజ్యము యొక్క ప్రముఖ విషయాలలో "అవును" లేక "కాదు" అని జవాబు నిచ్చుటకు దానిలో నీరు, ద్రాక్షా రసము, లేక తైలమును కలిపి వాడేవారు. ప్రజలు కూడా రాజ్యాధికారి ఒక్కడే అలాంటి జవాబులను విచారించగలడని, ద్రవముల వివిధ రకాల అమరిక ఆధారముగా చెప్పగలడని నమ్మేవారు. యోసేపు యొక్క గృహనిర్వాహకుడు కూడా తన యజమాని ఈ పనికే దానిని వాడునని అనుకోవడం స్పష్టంగా కనబడుతుంది. అయినప్పటికీ, యోసేపు ఫరోతో దేవుడు ఒక్కడే కలలకు అర్థము చెప్పుట ద్వారా భవిష్యత్తును తెలుసుకొనే జ్ఞానమును ఇచ్చునని ముందుగానే తెలియపరచెను (41:16, 25, 39). యోసేపునకు, ఆ వెండి గిన్నె బహుశా తన కార్యాలయమునకు ఒక గుర్తుగా కాదు కాని; ఈ వాక్యము ఆ విలువైన వస్తువును ఒక పాత్ర గానే కాని మరి యే విధముగా యోసేపు ఉపయోగించెనో చెప్పుటలేదు.

### కనుగొనుట (44:6-13)

**[6]అతడు వారిని కలిసికొని ఆ మాటలు వారితో చెప్పినప్పుడు [7]వారు -మా ప్రభువు ఇట్లు మాటలాడనేల? ఇట్టి పని చేయుట నీ దాసులకు దూరమవును గాక. [8]ఇదిగో మా గోనెలమూతులలో మాకు దొరికిన రూకలను కనాను దేశములోనుండి తిరిగి తీసికొనివచ్చితిమి; నీ ప్రభువు ఇంటిలోనుండి మేము వెండినైనను బంగారమునైనను ఎట్లు దొంగిలుదుము? [9]నీ దాసులలో ఎవరియొద్ద అది దొరుకునో వాడు చచ్చును గాక; మరియు మేము మా ప్రభువునకు దాసులముగా నుందుమని అతనితో అనిరి. [10]అందుకతడు-మంచిది, మీరు చెప్పినట్టే కానీయుడి; ఎవరియొద్ద అది దొరుకునో అతడే నాకు దాసుడగును; అయితే మీరు నిర్దోషులగుదురని చెప్పెను. [11]అప్పుడు వారు త్వరపడి ప్రతివాడు తన గోనెను క్రిందికి దించి దానిని విప్పెను. [12]అతడు పెద్దవాడు మొదలుకొని చిన్నవానివరకు వారిని సోదా చూడగా ఆ గిన్నె బెన్యామీను గోనెలో దొరికెను. [13]కావున వారు తమ బట్టలు చింపుకొని ప్రతివాడు తన గాడిదమీద గోనెలు ఎక్కించుకొని తిరిగి పట్టణమునకు వచ్చిరి.**

**వచనములు 6, 7.** యోసేపు 44:4, 5లో ఇచ్చిన సూచనలను మరల

చెప్పకుండా, ఈ వచనము ఆ గృహనిర్వాహకుడు వారిని **కలిసికొని** తన యజమాని **మాటలు వారికి చెప్పెను.** సహజముగా, ఆ సహోదరులు భయపెట్టే ఈ ఆరోపణలకు ఆశ్చర్యపోయారు. ఆ పాలకుని ఇంటిలో ముందు రోజు జరిగిన సంఘటనలను దృష్టిలో వుంచుకొని, వారు అతనితో మా ప్రభువు మాతో **ఇట్లు మాటలాడనేల**? అని అడుగుచున్నారు. వారు తాము అలాంటి ఆతిథ్యమును తృణీకరించి మరియు **అలాంటి** [ద్రోహమైన] **పనిని** చేయమని పేర్కొన్నారు.

**వచనము 8.** దీనికితోడు, ఆ సహోదరులు వారి పూర్వ ప్రవర్తన ఆధారముగా వారు నిర్దోషులని బలముగా నిలిచారు: వారు వారి మొదటి ప్రయాణము తరువాత **సంచులలో కనుగొన్న రూకలు** తిరిగి అప్పచెప్పడము ద్వారా వారు దొంగలు కాదని నిరూపించుకున్నారు. వారి సమాధానము మంచిగా వుంది; దొంగలు దొంగిలించిన వస్తువులు మరలా దొంగిలించుటకు తిరిగి ఇవ్వరు. వారు ఇలా అతని అడుగుచున్నారు, **నీ ప్రభువు ఇంటిలోనుండి మేము వెండినైనను బంగారమునైనను ఎట్లు దొంగిలుదుము?**

**వచనము 9.** ఆ సహోదరులు వారి నిర్దోషత్వమును బట్టి నమ్మకము కలిగి ఈ నిర్లక్ష్య మరియు మితిమీరిన ప్రమాణముచేసిరి: **నీ దాసులలో ఎవరియొద్ద అది దొరుకునో వాడు చచ్చును గాక; మరియు మేము మా ప్రభువునకు దాసులముగా నుందుమని అనిరి.** చాలా కాలం క్రింద, వారి తండ్రి కూడా ఇటువంటి మరణ శాసనమును ప్రకటించెను, తన దాసులలో ఎవరైనా లాబాను అన్యదేవతలను దొంగిలిన యెడల, తనకు ఇష్టురాలైన రాహేలు వాటిని కలిగి ఉండెనని అతనికి తెలియదు (31:31-35). అదే విధముగా ఉన్నా, ఆ సహోదరుల యొక్క ప్రకటన వారి కుటుంబ నిజాయితీని తిరిగి పెంచిందని సూచిస్తుంది, ఈ విషయములో, వారందరూ నిలువబడుటకు గాని పడిపోవుటకు గాని కలిసియున్నారు. ఆ సహోదరులు వారికి తెలియకుండానే వారు మొదటిసారి యోసేపు యొక్క ఇంటికి వెళ్లినప్పుడు వారికీ శిక్ష పడుననే భయము: బానిసత్వము నిజమగునని నిందించుకొనుచున్నారు (43:18).

**వచనము 10.** ఆ గృహనిర్వాహకుడు వారి ప్రతిపాదనను అంగీకరించి మరియు సమాధానమిచ్చెను, **మీరు చెప్పినట్టే కానీయుడి.** ఏదేమైనా, ఈ అపరాధానికి శిక్ష ఆ పనివాడికి, తరువాత యోసేపుకు చాలా తీవ్రముగా అనిపించి (44:17), అతడిని మెత్తపరిచెను: తప్పు చేసిన వాడు మాత్రమే **బానిస, మిగతావారు నిర్దోషులు** మరియు వారిని విడిచి పెట్టుటకు అనుమతించెను. ఏ సహోదరుడైతే దోషిగా పట్టుబడతాడో వానికి యోసేపు వలె: జీవితకాల బానిసత్వము, తను మరల విడిపింపబడతాననే న్యాయమైన ఆశ కూడా లేదు.

**వచనము 11.** ఆ సహోదరులకు ఆ గృహనిర్వాహకుని యొక్క ఆరోపణలు ఆధార రహితమైనవని తెలుసు, అందుకు వారిని వారు పూర్తిగా నివృత్తి చేసుకొనుటకు అనుమానించలేదు. అందువలన, వారు త్వరపడి: **ప్రతివాడు తన గోనెను క్రిందికి దించి దానిని విప్పెను.**

**వచనము 12.** అప్పుడు ఆ గృహనిర్వాహకుడు ఆ సహోదరుల సంచులను **సోదా** చేసెను. "సోదా" అను హెబ్రీ పదము (חָפַשׂ, *chapaś*) రాహేలు గుడారములో లాబాను నిశిత పరిశీలనకు కూడా ఇదే వాడబడెను (31:35). ఇక్కడ, ఆ పనివాడు చాలా శ్రద్ధగా **పెద్దవాడు మొదలుకొని చిన్నవానివరకు** సోదా చేసెను. అతనికి చురుకైన బుద్ధి మరియు ముందు రాత్రి వారు కూర్చున్న క్రమము గుర్తువుండి ఉండవచ్చు (43:33). మరియొకసారి, ఇది ఆ సహోదరులను ఆశ్చర్యపరిచెను. ఆ గృహనిర్వాహకునికి వారి పుట్టుకల యొక్క ఖచ్చితమైన క్రమము వరుసగా రెండోసారి ఎలా తెలిసి ఉండవచ్చు? అయినప్పటికీ, ఇది ప్రమాదవశాత్తు జరిగినది కాదు. యోసేపు తన సహోదరులను భోజనము యొద్ద కూర్చుండ బెట్టినపుడు మరియు వెండి గిన్నెను బెన్యామీను సంచిలో పెట్టుటకు ఒకే రకమైన సూచనలు ఇచ్చెను. ఆ గృహనిర్వాహకునికి వీటన్నిటికీ కారణాలు తెలియనప్పటికీ, తన ఆదేశాలకు తాను నమ్మకస్తుడై ఉండెను. చివరి వరకు అతడు దీనిని నడిపెను; మరియు దాని ఫలితముగా, **ఆ గిన్నె బెన్యామీను గోనెలో దొరికెను.**

**వచనము 13.** ఇది చూచిన తర్వాత, ఆ సహోదరులు **తమ బట్టలు చింపుకొని**, వారి లోతైన భావోద్వేగమును మరియు విచారమును వ్యక్తము చేసెను. ఇరవై సంవత్సరముల ముందు ఈ ఘటన, యాకోబు యోసేపు మరణించెనని తెలుసుకొని తన వస్త్రములను నిస్పృహలో మరియు దుఃఖములో చింపుకొనెను (37:33, 34). ఇప్పుడు ఆ సహోదరులు తన ముసలివాడైన తండ్రి వద్దకు వెళ్లి బెన్యామీను చనిపోయెనని లేక ఐగుప్తులో బానిస అని చెప్పుటకు భయపడెను. ఇంకొక విధముగా, యాకోబు అతనిని మరియెన్నటికి చూడలేడు. వారు వారి తండ్రి ఇటువంటి వార్తను సహించలేడని నమ్మెను; అతడు గుండె పగిలి చనిపోవును. అందువలన, వారు వారి వస్త్రములను అమితమైన బాధతో చింపుకొనిరి. ఆ సహోదరుల యొక్క ఐకమత్యం వారు రాహేలు యొక్క ఆఖరి కుమారుడు లేకుండా వారి తండ్రి యొద్దకు తిరిగి వెళ్లాలనే ఆలోచన కూడా వారు భరించలేకపోవడం మొదటి సూచన. ఈ పరిస్థితి ఒక క్రొత్త కోణాన్ని చూపిస్తుంది: సహోదరులు ప్రతీకార భావంతో యోసేపును బానిసగా అమ్మివేసిన దోషులుగా ఉన్నారు; ఈ సారి వారిమీద మోపబడిన నేరముపై వారు నిర్దోషులు, అయినా బెన్యామీను యొక్క భవిష్యత్తుపై వారు తీవ్ర విచారము వ్యక్తపరిచారు.

మరియొక ఎంపిక లేక, **ప్రతివాడు తన గాడిదను నింపుకొని**, ఆ ఐగుప్తు పాలకుని చేతియొద్ద కొంచెము దయ దొరకుననే ఒకే ఒక ఆశతో వారి గుంపు **పట్టణమునకు తిరిగి వెళ్లిపోయెను.**

## యోసేపు నొద్దకు అతని సహోదరులు తిరిగివచ్చుట మరియు వారి పక్షముగా యూదా యొక్క హృదయ పూర్వక విజ్ఞప్తి (44:14-17)

**[14]అప్పుడు యూదాయును అతని సహోదరులును యోసేపు ఇంటికి వచ్చిరి. అతడింక అక్కడనే ఉండెను గనుక వారు అతని యెదుట నేలను సాగిలపడిరి.**
**[15]అప్పుడు యోసేపు-మీరు చేసిన ఈ పని ఏమిటి? నావంటి మనుష్యుడు శకునము చూచి తెలిసికొనునని మీకు తెలియదా అని వారితో అనగా [16]యూదా యిట్లనెను-**
**ఏలినవారితో ఏమి చెప్పగలము? ఏమందుము? మేము నిర్దోషులమని యెట్లు కనుపరచగలము? దేవుడే నీ దాసుల నేరము కనుగొనెను. ఇదిగో మేమును ఎవనియొద్ద ఆ గిన్నె దొరికెనో వాడును ఏలిన వారికి దాసుల మగుదుమనెను.**
**[17]అందుకతడు-అట్లు చేయుట నాకు దూరమవునుగాక; ఎవని చేతిలో ఆ గిన్నె దొరికెనో వాడే నాకు దాసుడుగా నుండును; మీరు మీ తండ్రి యొద్దకు సమాధానముగా వెళ్లుడని చెప్పగా.**

**వచనము 14.** వారి కుటుంబములకు ఆహారము తీసుకొని ఇంటికి వెళ్లుటకు బదులుగా, **యూదాను మరియు అతని సహోదరులును యోసేపు యొక్క ఇంటికి** తిరిగి వెళ్లెను. అయినా, యోసేపుకు వారు తిరిగి వచ్చునని తెలియును, ఎందుకంటే ఈ భాగమంతా తన సేవకుని సహాయముతో రచించడం జరిగింది. "ఆ సహోదరులు" అనే పదము "యూదా మరియు అతని సహోదరులు"గా మారడము యాకోబు యొక్క నాలుగవ కుమారుడైన యూదా కొత్త నాయకత్వాన్ని సూచిస్తుంది. మరియొక ప్రాముఖ్యమైన మార్పు: యోసేపు ముందు మర్యాదగా నమస్కరించడానికి బదులుగా, ఇంతకుముందు రెండు సందర్భాలలో చేసినట్లుగా (42:6; 43:26, 28), అతని సహోదరులు **అతని ఎదుట నేలను సాగిలపడిరి.** వారు ఇకను మంచిమర్యాదలు కలిగిన విదేశీయులుగా ప్రవర్తించుట లేదుకాని; ధర్మశాస్త్రమిచ్చే కఠినశిక్ష కంటే క్షమాభిక్ష అవసరమైన నిరాశతో నిండిన వ్యక్తులుగా మారెను.

**వచనము 15. యోసేపు** వారిని: **మీరు చేసిన ఈ పని ఏమిటి? నావంటి మనుష్యుడు** [రాజ్య ఉన్నతాధికారి] **శకునము చూచి తెలిసికొనునని మీకు తెలియదా?** అని ప్రశ్నించెను. నాముందు మీరు పూర్తిగా శక్తిహీనులని ఆ రాజ్యాధికారి నొక్కి చెప్పుచున్నాడు. వారు ఆ వెండి గిన్నె దొంగిలించిన కారణంగా పడే శిక్ష నుండి తమను తాము రక్షించుకొనలేని నిస్సహాయులమని తెలుసుకొన్నారు; వారు చేయకలిగినదల్లా, ఆ ఐగుప్తు పాలకుని న్యాయమునకు బదులుగా క్షమాభిక్షను అర్థించడమే.

**వచనము 16.** యూదా వారి సహోదరుల పక్షముగా మాట్లాడెను, ఎందుకనగా అతనే యాకోబుకు, "నేను అతని [బెన్యామీను] గూర్చి పూటపడుదును" (43:9) అని చెప్పెను. తనకు రక్షించు మార్గము లేదు; ఆ పాలకునితో, **మేము**

**నిర్దోషులమని యెట్లు కనుపరచగలము?** అనే విచారముతో నిండిన ప్రశ్న తప్ప, వారికి **చెప్పుటకు** గాని లేక **మాట్లాడుట**కు గాని ఏమియు లేదు. యూదా వాడిన "నిర్దోషులుగా కనుపరచుట" అనే పదము హెబ్రీలో (צָדֵק, *tsadeq*) గా తర్జుమా చేయబడెను, ఇది తామారు విషయములో అతడు, "ఆమె నాకంటే నీతిమంతురాలు [*tsadeq*]" (38:26) అని ముందుగా ఈ పుస్తకములో చెప్పడం జ్ఞప్తికి తెస్తుంది.

వారు ఈ నేరములో నిర్దోషులైనా, యూదా ఈ ప్రకటనను: **దేవుడే నీ దాసుల నేరము కనుగొనెను** అని బహిర్గతముగా వెళ్లగక్కుచున్నాడు. ఇది రాజ్య ఉన్నతాధికారి యొక్క గిన్నెను దొంగిలించడం అనే అపరాధమును వారు ఒప్పుకుంటున్నట్లు అర్థము చేసుకొనగలము,మరియు ఒక ఐగుప్తీయుడు ఈ విధముగానే వ్యాఖ్యానించును. అయినప్పటికి, యుదా తనను కొద్ది కాలము నుండి ఇబ్బంది పెడుతున్న ఒక గొప్ప నేరమును తెలుపుచున్నాడు: తన సహోదరుడైన యోసేపును బానిసత్వములోనికి అమ్మివేయడము. వారు మొదటిసారి ఐగుప్తు వెళ్లినప్పుడు, ఆ ఐగుప్తు పాలకుడు వారిని చాలా కఠినంగా పరిగణించినప్పుడు ఆ సహోదరులు తీవ్రమైన పశ్చాత్తాపం పొందారు. అప్పుడు వారు-"నిశ్చయముగా మన సహోదరుని యెడల మనము చేసిన అపరాధమునకు శిక్ష పొందుచున్నాము. అతడు మనలను బతిమాలుకొనినప్పుడు మనము అతని వేదన చూచియు వినకపోతిమి; అందువలన ఈ వేదన మనకు వచ్చెనని" (42:21) ఒకనితో ఒకడు మాటలాడుకొనిరి. ఈ సారాంశములో, యూదా వారి తప్పులన్నీ కలిపి; వాటిని అంగీకరిస్తూ ఇలా చెప్పాడు, **ఇదిగో మేమును ఎవనియొద్ద ఆ గిన్నె దొరికెనో వాడును ఏలిన వారికి దాసుల మగుదుము.**

**వచనము 17.** ఒక్కడు (బెన్యామీను) చేసినదానికి సహోదరులనందరిని శిక్షించాలనే యూదా యొక్క ఆలోచనను యోసేపు తిరస్కరించాడు. దానిబదులుగా, అతడు ఈలాగనెను, **అట్లు చేయుట నాకు దూరమవునుగాక; ఎవని చేతిలో ఆ గిన్నె దొరికెనో వాడే నాకు దాసుడుగా నుండును.** ఒక నిర్దోషిని తప్పునకు బానిస చేసి మరియు శిక్షించడం, దైవ శాసనమును ఉల్లంఘించటం. న్యాయము తప్పు చేసిన వారినే శిక్షించమంటుంది, మరియు వారి సహోదరుడు చేసిన దానికి వారు శిక్షింపబడటం యోసేపు తిరస్కరించెను. యోసేపు తెలుసుకోవాలనుకుంటున్నది, వారు, తనకు విరోధముగా చేసిన పాపముకు, వారు నిజముగా పశ్చాత్తాప పడుతున్నారో లేదోనని, అందువలన అతడు చాలా సంవత్సరముల ముందు తాను అనుభవించిన దానిని, అతని సహోదరులు కుడా అనుభవించే అలాంటి పరిస్థితిలో వారిని ఉంచెను. ఇలాంటి ఎంపికలో వారు, బెన్యామీనును విడిచిపెట్టి తాము స్వతంత్రులుగా ఇంటికి వెళ్తారా, వారి తండ్రి యొక్క కనిష్ట కుమారుడిని బలవంతముగా ఐగుప్తులో బానిసగా వదిలి వెళ్తారా? ఈ నిర్ణయాత్మక సమస్యలో జవాబువైపుకు వెళ్తే, యోసేపు ఆ సహోదరులతో ఒక క్లిష్టమైన ప్రతిపాదన చేసాడు: **మీరు మీ తండ్రి యొద్దకు సమాధానముగా వెళ్లుడి.** ముందే సూచించునట్లు, ఎవరి యొద్ద ఆ గిన్నె ఉన్నదో వారే వెనుకకు ఉండవలెను.

## యోసేపునకు యూదా యొక్క నిస్వార్థమైన విజ్ఞప్తి (44:18-34)

18యూదా అతని సమీపించి-ఏలినవాడా ఒక మనవి; ఒక మాట యేలిన వారితో
తమ దాసుని చెప్పుకొననిమ్ము; తమ కోపము తమ దాసునిమీద
రవులుకొననీయకుము; తమరు ఫరో అంతవారుగదా 19ఏలినవాడు-మీకు
తండ్రియైనను సహోదరుడైనను ఉన్నాడా అని తమ దాసులనడిగెను. 20అందుకు
మేము-మాకు ముసలివాడైన తండ్రియు అతని ముసలితనమున పుట్టిన యొక
చిన్నవాడును ఉన్నారు; వాని సహోదరుడు చనిపోయెను, వాని తల్లికి వాడొక్కడే
మిగిలియున్నాడు, వాని తండ్రి వానిని ప్రేమించుచున్నాడని చెప్పితిమి. 21అప్పుడు
తమరు-నేనతని చూచుటకు అతని నా యొద్దకు తీసికొని రండని తమ దాసులతో
చెప్పితిరి. 22అందుకు మేము-ఆ చిన్నవాడు తన తండ్రిని విడువలేడు. వాడు తన
తండ్రిని విడిచినయెడల వాని తండ్రి చనిపోవునని యేలినవారితో చెప్పితిమి.
23అందుకు తమరు-మీ తమ్ముడు మీతో రానిఎడల మీరు మరల నా ముఖము
చూడకూడదని తమ దాసులతో చెప్పితిరి. 24కాబట్టి నా తండ్రియైన తమ దాసుని
యొద్దకు మేము వెళ్లి యేలినవారి మాటలను అతనికి తెలియచేసితిమి. 25మా తండ్రి-
మీరు తిరిగి వెళ్లి మనకొరకు కొంచెము ఆహారము కొనుక్కొని రండని చెప్పినప్పుడు
26మేము-అక్కడికి వెళ్లలేము; మా తమ్ముడు మాతో కూడ ఉండినయెడల
వెళ్లుదుము; మా తమ్ముడు మాతో నుంటేనేగాని ఆ మనుష్యుని ముఖము
చూడలేమని చెప్పితిమి. 27అందుకు తమ దాసుడైన నా తండ్రి-నా భార్య నాకిద్దరిని
కనెనని మీరెరుగుదురు. 28వారిలో ఒకడు నా యొద్దనుండి వెళ్లిపోయెను. అతడు
నిశ్చయముగా దుష్టమృగములచేత చీల్చబడెననుకొంటిని, అప్పటినుండి అతడు
నాకు కనబడలేదు. 29మీరు నా యెదుటనుండి ఇతని తీసికొనిపోయిన తరువాత
ఇతనికి హాని సంభవించినయెడల నెరసిన వెండ్రుకలుగల నన్ను మృతుల
లోకములోనికి దుఃఖముతో దిగిపోవునట్లు చేయుదురని మాతో చెప్పెను. 30కావున
తమ దాసుడైన నా తండ్రియొద్దకు నేను వెళ్లినప్పుడు ఈ చిన్నవాడు మాయొద్ద
లేనియెడల 31అతని ప్రాణము ఇతని ప్రాణముతో పెనవేసికొని యున్నది గనుక ఈ
చిన్నవాడు మాయొద్ద లేకపోవుట అతడు చూడగానే చనిపోవును. అట్లు తమ
దాసులమైన మేము నెరసిన వెండ్రుకలు గల తమ దాసుడైన మా తండ్రిని మృతుల
లోకములోనికి దుఃఖముతో దిగిపోవునట్లుచేయుదుము. 32-33తమ దాసుడనైన నేను
ఈ చిన్న వానినిగూర్చి నా తండ్రికి పూటపడి-నీ యొద్దకు నేనతని తీసికొని
రానియెడల నా తండ్రి దృష్టియందు ఆ నింద నా మీద ఎల్లప్పుడు ఉండునని
చెప్పితిని. కాబట్టి తమ దాసుడనైన నన్ను ఈ చిన్నవానికి ప్రతిగా ఏలినవారికి
దాసునిగా నుండనిచ్చి యీ చిన్నవాని తన సహోదరులతో వెళ్లనిమ్ము. 34ఈ
చిన్నవాడు నాతోకూడ లేనియెడల నా తండ్రియొద్దకు నేనెట్లు వెళ్లగలను?
వెళ్లినయెడల నా తండ్రికి వచ్చు అపాయము చూడవలసి వచ్చునని చెప్పెను.

**వచనము 18. యూదా** యొక్క అభ్యర్థన బెన్యామీనును ఐగుప్తులో జీవితకాల బానిసత్వము నుండి రక్షించడానికి ఉద్రేకపూరిత విజ్ఞప్తిగా ప్రారంభమైనది. ఇది ఆదికాండము పుస్తకములో పొడవైన ప్రసంగముగా ఉన్నది; అందులో యూదా తన తండ్రిపై దయ చూపించాలని ఆ పాలకుని విజ్ఞప్తి చేశాడు. ఆ ప్రసంగములో చాలా వరకు తన తండ్రితో మరియు ఆ ఐగుప్తు పాలకునితో చేసిన సంభాషణలో ఎన్నుకోబడిన కొన్ని భాగములు మరలా జ్ఞాపకంచేశాడు. యూదా ఎప్పుడైతే ఆ పాలకుని (యోసేపు), **సమీపించాడో** అతడు అతనితో చాలా దాక్షిణ్యపూర్వకమైన పదములతో మాట్లాడాడు, అవి ఇలా చెప్పబడినవి: **ఏలినవాడా ఒక మనవి; ఒక మాట యేలిన వారితో తమ దాసుని చెప్పుకొననిమ్ము; తమ కోపము తమ దాసుని మీద రవులుకొననీయకుము; తమరు ఫరో అంతవారుగదా** (41:39-44 చూడుము).

**వచనము 19.** యూదా వారు మొదటిసారి ఐగుప్తునకు వచ్చినప్పుడు అతడు, **మీకు తండ్రియైనను లేక** [మరియొక] **సహోదరుడైనను ఉన్నాడా?** అని మమ్ములను విచారణ చేసితిరి కదా అని గుర్తుచేసెను. “తండ్రి” (אָב, *’ab*) అనే వాడుక ఇక్కడ ప్రాముఖ్యమైనది: యూదా దీనిని తన ప్రసంగములో పద్నాలుగు పర్యాయములు ఉపయోగించెను. అతడు తీసుకున్న ఆ నిర్ణయము తన తండ్రిపై ఎటువంటి ప్రభావము చూపిస్తుందో ఆ పాలకునికి చెప్పడానికి తరచుగా పునరుశ్చరించెను.

**వచనము 20.** యాకోబు మరియు బెన్యామీను **ఒక ముసలివాడైన తండ్రి మరియు అతని ముసలితనమున పుట్టిన యొక చిన్నవాడు** గా సూచించబడ్డారు. బెన్యామీనును “చిన్నవాడు” (יֶלֶד, *yeled*) గా వర్ణించడము యాకోబుకు అతడు “తన ముసలితనమందు” జన్మించుట వలనని అర్థము, అలా చెప్పడము వలన అతడు ఆ సమయానికి మరీ చిన్నవాడని అపార్థము చేసికొనకూడదు. దానికి విరుద్ధంగా, యూదా ఈ మాటలు చెప్పే సమయానికి అతడు ముప్పయిలలో ఉన్న ఒక యవ్వనస్థుడై ఉండవచ్చు. NASBలో ఉన్న కష్టములను, ఈ తర్జుమాతో NRSV తొలగించెను: “మాకు ఒక తండ్రి, ముసలివాడు మరియు ఒక యవ్వనుడైన సహోదరుడు, తన ముసలితనమందు పుట్టినవాడు.” యూదా ముసలివాడైన తన తండ్రిని గూర్చి అలాగే యవ్వనుడైన బెన్యామీను గూర్చి నొక్కి చెప్పడం, ఆ ఐగుప్తు పాలకుని యొక్క జాలిని రాబట్టుకొనే ప్రయత్నం, నిజముగా ఇది అనవసరము ఎందుకంటే యోసేపుకు ఈ వాస్తవాలన్నీ ముందే తెలుసు (43:27-29).

ఆ ప్రసంగము కొనసాగించబడినది: **వాని** [బెన్యామీను యొక్క] **సహోదరుడు చనిపోయెను, వాని తల్లికి వాడొక్కడే మిగిలియున్నాడు, వాని తండ్రి వానిని ప్రేమించుచున్నాడు.** యూదా, యోసేపు యొక్క మరణము గూర్చి తన ఊహ తప్పని త్వరలోనే తెలుసుకొన బోవుచున్నాడు (45:3).

**వచనము 21.** యోసేపు ముందుగా తన సహోదరులను పరీక్షించి వారిని బెన్యామీనును ఐగుప్తునకు **తీసుకు రమ్మనెను**, తద్వారా అతడు తన **దృష్టిని వాని**

**మీద** వుంచి మరియు ఆ యవ్వనస్థుడు బాగుగా మరియు సజీవముగా ఉన్నాడని తెలుసుకోవాలనే కారణము. ఇది వారు చేసిన నిబంధన ధ్రువీకరించడానికి ఒక పద్ధతి (42:20).

**వచనము 22.** ఆ సహోదరులు యోసేపును విరమింపచేయడానికి ఇలా ప్రయత్నించుచున్నారు, **ఆ చిన్నవాడు తన తండ్రిని విడు వలెడు. వాడు తన తండ్రి విడిచినయెడల వాని తండ్రి చనిపోవును.** ఈ మాటలు యాకోబు యొక్క హెచ్చరికకు ప్రతిధ్వని. అతడు తన కుమారులతో ఇలా అనెను, ఐగుప్తుకు వెళ్లేటప్పుడు బెన్యామీనుకు ఏదైనా హాని జరిగిన యెడల, "నెరసిన వెండ్రుకలు గల నన్ను మృతుల లోకములోనికి దుఃఖముతో దిగిపోవునట్లు చేయుదురు" (42:38).

**వచనము 23.** యూదా ఆ ఐగుప్తు ప్రభువునకు తన మునుపటి షరతును గుర్తుచేసెను: **మీ తమ్ముడు మీతో రాని యెడలమీరు మరల నా ముఖము చూడకూడదని చెప్పితిరి** (43:3-5 వ్యాఖ్యలు చూడుము).

**వచనములు 24-26.** వారు మొదటిసారి ఐగుప్తును దర్శించినపుడు ఆ పాలకుని యొక్క మాటలను మరియు సంఘటనలను గుర్తుచేసుకొని, కనానులో నున్న యాకోబుకు ఈ వార్తను తెలియపరచాడు. మొదట, వారు యేలినవారి [ఆ ఐగుప్తీయుడు] మాటలను అతనికి తెలియచేసితిమి (44:24); కాని కొంత కాలము గడచిన తర్వాత, వారి ఆహారధాన్యములు తరిగినప్పుడు, వారి తండ్రి వారితో ఇలా చెప్పెను, **మీరు తిరిగి వెళ్లి మన కొరకు కొంచెము ఆహారము కొనుక్కొని రండి** (44:25). వారు ఆ పాలకుని యొక్క హెచ్చరిక **మీ తమ్ముడు** మీతో లేకపోతే మీరు ఐగుప్తుకు తిరిగి రాకూడదనెనని యాకోబుకు గుర్తుచేసెను (44:26). అతని యోసేపు యొక్క **ముఖము** మరల **చూడవలె**నంటే బెన్యామీను యొక్క హాజరు అవసరమని యాకోబునకు వివరించెను. వారు ఐగుప్తు నుండి సరుకులు కొనుక్కొనకపోతే, వారి దూర ప్రయాణము వ్యర్థమగును మరియు కుటుంబమంతా చనిపోయే ప్రమాదముంది.

**వచనము 27-29.** యూదా అప్పుడు తన ప్రియమైన **భార్యయైన** రాహేలు యొక్క ఇద్దరు కుమారులనూ పోగొట్టుకొనుననే తన తండ్రి యొక్క భయమును వివరించెను (44:27). దీనిని, ఈ ఇద్దరు కుమారులలో పెద్దవాడు తన తండ్రి **యొద్ద నుండి వెళ్లిపోయెనను** కథతో విచారము వ్యక్తపరుస్తున్నాడు. తర్వాత, ఆ తండ్రికి రక్తపు మరకలు పడినఉన్న మిగిలిన అంగీని చూపెట్టినప్పుడు, అతడు ఇలాగు ముగించెను, **యోసేపు నిశ్చయముగా చీల్చబడెను** (44:28; 37:31-33 చూడుము). ఈరోజు వరకు, యోసేపు బ్రతికి ఉండవచ్చునన్న ఆధారము అతడు చూడలేదు. యూదా వారు ఐగుప్తుకు బయలుదేరక ముందు వారి తండ్రి వారితో చెప్పిన ముగింపు మాటలను మరలా చెప్పుచున్నాడు, **మీరు నా యెదుటనుండి ఇతని తీసికొనిపోయిన తరువాత ఇతనికి హాని సంభవించినయెడల నెరసిన వెండ్రుకలుగల నన్ను మృతుల లోకములోనికి దుఃఖముతో దిగిపోవునట్లు చేయుదురని మాతో చెప్పెను** (44:29; 42:38 చూడుము).

**వచనములు 30, 31.** యూదా ఆ ఐగుప్తు పాలకునితో ఆందోళనతో విడువక చేసిన ఆఖరి విజ్ఞప్తి ముసలివాడైన తన తండ్రి యొక్క మానసిక మరియు శారీరక సంక్షేమము మీద ఆధారపడిఉన్నది. అతడు ఇలా చెప్పెను, **కావున తమ దాసుడైన నా తండ్రియొద్దకు నేను వెళ్లినప్పుడు ఈ చిన్నవాడు మాయొద్ద లేనియెడల, అతని ప్రాణము ఇతని ప్రాణముతో పెనవేసికొని యున్నది గనుక. . . . అతడు చనిపోవును.** యూదా తన తండ్రిపై తనకున్న భయమును ఆందోళనను పెంచి చెప్పడము లేదు. అతడు, యాకోబు తన చిన్నవాడైన కొడుకును పోగొట్టుకొని బ్రతకలేడని నమ్మెను. యాకోబుకు బెన్యామీను పట్ల ఉన్నా గొప్ప ప్రేమ ఈ వక్తీకరణలో చూడవచ్చు "అతని ప్రాణము ఇతని ప్రాణముతో పెనవేసికొని యున్నది." ఇటువంటి హెబ్రీ పదములే 1 సమూయేలు 18:1లో ఉన్న వాక్యములో ఉన్నవి: "యోనాతాను హృదయము దావీదు హృదయముతో కలిసిపోయెను."

**వచనములు 32, 33.** ఈ ఆకట్టుకొనే కథలో వారిరువురి సంభాషణ ప్రేమతో నిండియుంది, యూదా తన తండ్రి యొక్క సంక్షేమములో తన భాగము వుందని ప్రస్తావించెను. మొట్ట మొదటిగా యూదా ఆ పాలకుని యొద్ద తన తండ్రితో తాను చేసిన సంభాషణను ఇలా బహిర్గతము చేసాడు, నేను **అతనిగూర్చి పూటపడుదును**, నీవు అతనిగూర్చి నన్నుఅడుగవలెను; నేను అతని **తిరిగి నీయొద్దకు** తీసుకొనివచ్చి నీయెదుట నిలువబెట్టనియెడల **ఆ నింద నా మీద ఎల్లప్పుడును ఉండును**(43:9).

ముగింపులో, యూదా తనను తానే బెన్యామీనుకు ఒక ప్రత్యామ్నాయంగా సమర్పించుకొను చున్నాడు. అతని యొక్క దయతో నిండిన అభ్యర్థన **కాబట్టి తమ దాసుడనైన నన్ను ఈ చిన్నవానికి ప్రతిగా ఏలినవారికిదాసునిగా నుండనిచ్చి** అతడు ఇలా విజ్ఞప్తి చేసాడు **యీ చిన్నివాని తన సహోదరులతో** కనానులో నున్న తనన తండ్రి వద్దకు వెళ్లనిమ్ము. ఈ ఉదారమైన సమర్పణ యూదాలో ఒక నిజమైన మార్పును ప్రతిబింబిస్తుంది (37:26-28 చూడుము). యూదా బెన్యామీనును విడిచిపెట్టి తనను బానిసగా చేసుకోమని చేసిన అభ్యర్థన తన జీవితములో చాలా ప్రాముఖ్యమైన నైతిక సమయము. పాత నిబంధనలో ఇటువంటి సంఘటన ఇంతకుముందు ఎన్నడూ సంభవించలేదు.

**వచనము 34.** యూదా ఈ ప్రశ్నతో ముగించెను: **ఈ చిన్నవాడు నాతోకూడా లేనియెడల నా తండ్రియొద్దకు నేనెట్లు వెళ్లగలను? వెళ్లినయెడల నా తండ్రికి వచ్చు అపాయము** ["కష్టము"; NIV] **చూడవలసి వచ్చునని చెప్పెను.** ఈ నిస్వార్థమైన క్రియ యూదా తన స్వంత జీవితము మరియు స్వతంత్రత కంటే ఎక్కువ తన తండ్రిపై మరియు బెన్యామీనుపై శ్రద్ధ వహించెను. ఇది కానానులో విడువబడిన తన స్వంత పిల్లలను (46:12) కూడా మరిచిపోవడానికి, బహుశా మరల ఎప్పుడు తిరిగి వారిని చూడకపోయినా, తన తండ్రి బెన్యామీనును పోగొట్టుకొనుట వలన కష్టపడుట ఆపాలని, అతడు సంసిద్ధుడాయెను. యూదా యొక్క స్పందన యోసేపుకు తాను తెలుసుకోవాలనుకొంటున్నది తెలిపెను.

# అన్వయము

## దైవకృతముగా పరీక్షించుట (అధ్యాయము 44)

విద్యార్థులు తమకివ్వబడిన పనిని చేయడం చాలా తక్కువగా ఇష్టపడినా, ఈ పరికరాలు విద్యా విధానములో ఒక విలువైన పాత్ర పోషిస్తాయి; పరీక్షలు విద్యార్థులు అధిక స్థాయిలో జ్ఞానమును పొందుటకు చైతన్య పరుస్తాయి. అదే విధముగా, జీవితములో మనము ఎదుర్కొనే పరీక్షలు దేవునిపై మనకున్న నమ్మకమును పెంచుతాయి. అవి మన విశ్వాసమును పెంపొందించు కొనుటకు సహాయపడతాయి.

*దేవుని ప్రజలు కొన్నిసార్లు తీవ్రముగా మరియు ఊహించని విధముగా పరీక్షించబడతారు.* అబ్రాహాము మరియు శారా వారి వృద్ధాప్యంలో దేవుడు వారికి సంతానము ఇస్తానన్న వాగ్దానమును విశ్వసించడానికి వారు పోరాడారు (16:1-6; 17:1, 4-8, 15-19; 18:1, 2, 9-15). దీనికంటే గొప్ప పరీక్ష ఎప్పుడైతే దేవుడు తన యవ్వనుడైన కుమారుడు ఇస్సాకును మోరీయా పర్వతముపై బలిగా ఇవ్వమన్నప్పుడు స్పష్టమవుతుంది (22:1, 2). ఈ సమయానికి, అబ్రాహాము తన కుమారుడుని బలిగా ఇవ్వడానికి, విశ్వాసములోను మరియు విధేయతలోను పరిణితి చెందాడు. అతడు, తను అలా చేసిన, దేవుడు ఇస్సాకును మృతులలోనుండి లేపుతాడని నమ్మాడు (హెబ్రీ. 11:17-19). అందువల్ల, ఎంత క్లిష్టమైనప్పటికీ అబ్రాహాము తన కుమారుని వధించుటకు కత్తి పైకెత్తగా దేవదూత ఆ విషమ పరిస్థితిలో అతనిని ఆపాడు (22:9-18).

మరికొన్ని ఉదాహరణలు ఇశ్రాయేలీయుల యొక్క దైవిక పరీక్షలో ఉన్నవి. అబ్రాహాము వలె కాకుండా, అవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, దేవునికి వ్యతిరేకముగా, మరియు పది ఆజ్ఞల నిబంధనకు విధేయత కలిగివుంటామని అవిధేయత చూపిస్తూ, తరచుగా పరీక్షలో విఫలమాయెను (నిర్గమ. 24:1-8). మోషే చెప్పెను, "మరియు నీవు ఆయన ఆజ్ఞలను గైకొందువో లేదో నిన్ను శోధించి నీ హృదయములో నున్నది తెలుసుకొనుటకు నిన్ను అణచు నిమిత్తమును అరణ్యములో ఈ నలువది సంవత్సరములు నీ దేవుడైన యెహోవా నిన్ను నడిపించిన మార్గామంతటిని జ్ఞాపకము చేసికొనుము" (ద్వితీ.8:2). పాత నిబంధనలో విషాదమేమిటంటే ఎన్ని సార్లు దేవుడు ఇశ్రాయేలీయుల యొక్క విశ్వాసమును మరియు విధేయతను పరీక్షించినా, వారు ఘోరముగా విఫలమైరి.[4]

దేవుడు అబ్రాహాము మరియు మోషేలా కాకుండా యోసేపును వేరొక విధముగా పరీక్షించెను. ముందుగా దేవుడు విశ్వాసపు వీరులతో ప్రత్యక్షముగా మాట్లాడేవాడు, వారు ప్రజలకు ఆ వర్తమానము చెప్పేవారు. ఏదేమైనప్పటికీ, దేవుడు యాకోబు కుమారులెవరితోను ప్రత్యక్షముగా మాట్లాడలేదు కాని, యోసేపు యొక్క సహోదరులను, చారిత్రాత్మక పరిస్థుతుల ద్వారా ఆయన దైవకృతమైన కార్యం చేశాడు. ఈ అన్ని విషయాలలో దేవుడు పరీక్షించడానికి గల ఉద్దేశము

విమోచించుటకే, కాని వివిధ రకములుగా కథలు అభివృద్ధి చెందాయి.

అబ్రాహాము, మోషే మరియు ఇశ్రాయేలుకు దేవుని పట్ల వారి విశ్వాసమును మరియు నిబద్ధతను లోతుకు తీసుకు వెళ్లుటకు తీవ్రముగా పరీక్షించి విధేయత వైపు నడిపించెను. క్రొత్త నిబంధనలో దేవుని ప్రజల కథ, ఇదే విధముగా నుండెను, యూదా మరియు రోమా అధికారులు విశ్వాసమును మరియు విధేయతను హింసించుట ద్వారా పరీక్షించెను. మొదటి క్రైస్తవులు వేర్వేరు స్థలాలలో మరియు చారిత్రాత్మక ప్రకరణలలో సమూహముగా నుండెను (అపొస్తలుల కార్యములు, 2 కొరింథీయులకు, ఫిలిప్పీ, 2 తిమోతి, ప్రకటన చూడుము). ఇవన్నీ దారుణమైన ప్రయత్నాలు; మరియు ప్రభువు సహోదరుడైన యాకోబు, వాటి గూర్చి ఇలా చెప్పెను "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష", "ఓర్పును పుట్టించును" (యాకోబు. 1:3). మరియొక మాటలలో, పరీక్షలు గుణమును కట్టుకొనుటకు, వ్యతిరేకతను ఎదుర్కొని నిలబడడం అని అర్థము. కష్టమైనప్పటికీ, పరీక్షలు క్రైస్తవుని పరిణితికి దారితీస్తాయి.

ఆదికాండము కథనములో, యాకోబు కుమారుల పరీక్షలను అడ్డగించింది అన్యమత ప్రభుత్వమో లేక విదేశీ గుంపో కాదు కాని; యోసేపు తనకు తానే, తన సహోదరులు పశ్చాత్తాపానికి మరియు యాకోబు కుటుంబమంతా కలవడానికి ఒక దైవిక పరికరముగా మారెను. దాని ఫలితంగా, వారు చివరికి దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానమును నమ్మి ఐగుప్తుకు తరలెను (15:13-16), ఎక్కడైతే వారు నిర్గమకాండ సమయము వరకు ఫలించి మరియు అభివృద్ధి చెందారు. ఆ సహోదరులు ఐగుప్తునకు తిరిగి వచ్చినప్పుడు, ఐగుప్తు పాలకుడు (యోసేపు) వారికి స్వాగతము చెప్పి వారిని తన ఇంటికి ఒక ఖరీదైన విందుకు ఆహ్వానించెను (43:31-34). మనకు ఇలా కనబడును, వారు "విందు ఆరగించి అతనితో సంతుష్టిగా త్రాగిరి," అందువలన వారు పూర్తిగా అప్రమత్తంగా లేరు. బహుశా ఈ కారణము వల్లనే, యోసేపు యొక్క గృహ నిర్వాహకుడు గోనెలు పట్టినంత ఆహారము నింపి, ఎవరి రూకలు వాని గోనె మూతిలో నింపి, బెన్యామీను గోనె మూతిలో వెండి గిన్నె ఉంచిన సంగతి వారికి తెలియలేదు (44:1, 2). ఆ రాత్రి విశ్రమించిన తరువాత, ఆ సహోదరులు కనానుకు తిరిగి వెళ్లుచున్నప్పుడు, వారికి అంతా బాగుగా అనిపించెను. వారు విస్తారముగా ధాన్యమును కొనుక్కొనెను, షిమ్యోను చెరసాల నుండి విడిపింపబడెను, మరియు బెన్యామీను వారితో నుండెను. వారు వారి తండ్రికి మరియు మిగిలిన కుటుంబమునకు వారి విజయవంతమైన ప్రయాణము సంతోషము ఇచ్చునని ఊహించిరి.

యోసేపు యొక్క గృహనిర్వాహకుడు వారిని కలిసికొని మరియు వారిమీద దొంగిలెనని ఆరోపణ చేసినప్పుడు వారు అప్పుడే ఆ పట్టణమును విడిచి పెట్టిరి. అతడు వారితో తన యజమాని ఇచ్చిన మంచి ఆతిథ్యమునకు మీరు అతని శకునము చూచు గిన్నెను దొంగిలించి కీడు చేసితిరి (44:4, 5). ఇది తీవ్రమైన ఆరోపణ. మూఢ విశ్వాసమును బట్టి, ఆ రాజ్యాధికారి ఆ దేశము యొక్క

విషయాలను గూర్చి ఫరోకు సరియైన సలహాలు ఇచ్చుటకు ఆ గిన్నె అవసరము. అయినా, ఆ సహోదరులు వారి నిర్దోషత్వమును బట్టి వ్యతిరేకించి అంతే కాకుండా ఎవరి సంచిలో ఆ పాలకుని గిన్నె దొరుకునో వాడు చచ్చునని, మిగిలిన వారందరూ తమ యజమానికి దాసులమవుదుమని వారు అంగీకరించిరి. అలాంటి తీవ్రమైన ప్రతిజ్ఞ చేయడం ఒక తప్పు, కాని వారు వారి తండ్రి లాబానుతో చేసిన నిర్లక్ష్య ప్రతిజ్ఞను బట్టి ప్రభావితం చేయబడ్డారు. అతడు లాబాను అన్యదేవతలను దొంగిలిన వారిపై, ఒక మరణ శాసనం చేసాడు, అయితే రాహేలు వాటిని కలిగి వుందని అవి తన ఒంటె సామగ్రిలో దాచెనని అతనికి తెలియదు (31:32). అవి కనుగొనబడ నందున, రాహేలు శిక్ష తప్పించుకొనెను.

ఆ వెండి గిన్నె, ఏదేమైనప్పటికీ, అతడి దాని తీయక పోయినా, బెన్యామీను గోనెలో కనుగొనబడెను. అతడు మరియు వాని సహోదరులు పట్టణమునకు తిరిగి వెళ్లి ఆ ఐగుప్తు పాలకుని ముందు తీర్పు కోసం నిలబడాలి. బెన్యామీను ఆ గిన్నె తీయుట బట్టి దోషిగా కనబడుచుండగా, ఆ గృహనిర్వాహకుడు ఆ సహోదరుల తీర్పును పాక్షికంగా అంగీకరించెను. అతడు దోషులకు బానిసత్వమును శిక్షగా మరియు నిర్దోషులకు స్వేచ్ఛను ఇచ్చి శిక్షను తగ్గించెను (44:10).

*దేవుని యొక్క పరీక్షలు బాధపెట్టే పాపమును బహిర్గతము చేసి సమాధానమునకు మరియు పశ్చాత్తపమునకు ద్వారాములు తెరచును.* ఆ వెండి గిన్నెను సోదా చేయుట పెద్దవాని నుండి మొదలై చిన్నవాని వరకు సాగెను. ఇది బహుశా ఆ సహోదరులను ఆశ్చర్యపరచి ఉండవచ్చు (43:33; 44:12); కాని, ఆ అన్వేషణ సాగుచుండగా వారి స్పందనలు నిరాశగా మరియు వేదనగా మారెను. వారు తమ సంచులను గాడిదలపై నుంచి పట్టణములోని యోసేపు ఇంటికి (44:13) ప్రయాణమవుచుండగా, ఆ ఉదయము సంతోషముగా ఉత్సాహంగా వుంటే ఇది మరణమునకు నడచి వెళ్లుచున్నట్లు ఉన్నది.

వారు అక్కడకు చేరుకొని మరియు ఆ ఐగుప్తు అధికారికి[5] సాష్టాంగ నమస్కారము చేసినప్పుడు, అతడు వారినడిగెను, “మీరు చేసిన ఈ పని ఏమిటి? నావంటి మనుష్యుడు శకునము చూచి తెలిసికొనునని మీకు తెలియదా?” (44:15). అతడు తనని మోసము చేయడానికి ప్రయత్నించడం నిష్ఫలం అనుచుండెను. ఈ సమయానికి, యూదా ఈ వంచన అర్థములేనిదని తెలిసికొనెను, కాని అతని దగ్గర అబద్ధములు లేవు. అతడు తన తండ్రికి బెన్యామీను బాధ్యత తాను తీసుకుంటానని వాగ్దానము చేసెను; అందువలన అతడు దానిని తనపై వేసికొని తన సహోదరులందరి పక్షముగా మరియు, ప్రత్యేకముగా బెన్యామీను పక్షముగా మాటలాడుచుండెను.

ఆ సహోదరులు పట్టణమునకు తిరిగి వచ్చుచుండగా, యూదా దేవుని సహాయమునకు మరియు క్షమాపణ కొరకు ప్రార్థన చేసియుండవచ్చును. అతడు సత్యమును చెప్పుటకు నిర్ణయించుకొనెను, అతని ప్రసంగము తన యొక్క మరియు తన సహోదరుల యొక్క పాపములను ఒప్పుకొనుచున్నట్లు

నమ్మకమును వ్యక్తీకరించెను. అతడు వారు యోసేపును బానిసత్వము లోనికి అమ్మివేసినప్పటినుండి, మరుగునవున్న తమ దోషమైన మనస్సాక్షిని బహిర్గతము చేసెను. సాకుల మీద మరియు మోసపరిచే అబద్ధముల మీద ఆధారపడకుండా, యూదా ఖచ్చితముగా చెప్పెను, "దేవుడే నీ దాసుల నేరమును కనుగొనెను." అతడు మేము ఆ పాలకునికి దాసులమవుదుమని అంగీకరించెను (44:14-16).

ఎవరైతే నిజముగా పశ్చాత్తాపపడి మరియు వారి పాపములను ఒప్పుకొనునో వారు ఒక జీవితములో వ్యత్యాసమైన మార్గమును అనుసరించుచుండగా మంచి ప్రజలుగా మారుదురు. యూదా తనను కాని తన సహోదరులను కాని కాపాడుకొనుటకు ఇక ప్రయత్నించలేదు, కాని అతని ప్రకటన "దేవుడే నీ దాసుల నేరమును కనుగొనెను" (44:16) ఆ సంచులలో రూకలకు లేక ఆ వెండి గిన్నె కనుగొనినందుకు మాత్రమే వర్తించుట లేదు. దానికి బదులుగా, ప్రాధమికంగా అది వారు రెండు దశాబ్దాలనుండి దాచియుంచిన పాపమునకు, మరి ముఖ్యముగా యోసేపును బానిసత్వములోనికి అమ్మివేసే అంత ద్వేషమునకు అది వర్తించబడినది (37:4, 8, 26-28). ఇది వారు యాకోబునకు తన కుమారుడు యోసేపు చనిపోయాడన్న ఆలోచన తెచ్చిన హృదయ వేదనను కూడా కలుపుతుంది (37:31-35). వారు మొదట ఐగుప్తు వెళ్లినప్పుడు, వారు తమ తండ్రిని మరియు యోసేపును చూచిన విధానమును బట్టి తప్పు చేసామని వ్యక్తపరిచారు; నిజానికి, ఇది ఆ ఐగుప్తు పాలకునికి (యోసేపు) కన్నీరు తెప్పించెను (42:21-24).

అయితే, యోసేపు తనను తాను తన సహోదరులకు కనపరచక ముందు, బెన్యామీను పట్ల వారి వైఖరి ఎలా వుందో చూడాలను కున్నాడు. ఈ కారణము బట్టి, మిగతా సహోదరులందరూ కనానుకు తిరిగి వెళ్ల వచ్చునని ప్రకటించెను, కాని బెన్యామీను తనకు బానిసగా ఐగుప్తులో ఉండవలెననెను (44:17). యోసేపును బానిసత్వములోనికి అమ్మివేసి ముభావంగా వెళ్లిపోయినట్లు బెన్యామీనును ఐగుప్తు బంధకములో వదిలేస్తారా? సమాధానము నెమ్మదిగా రావట్లేదు. యూదా ఆ ప్రకటన వినగానే, వెంటనే బెన్యామీనును కాపాడుటకు కదిలించే ప్రసంగముతో ముందుకు వచ్చెను. అందులో, తన కుటుంబ చరిత్రను, తనకప్పటికే తెలిసిన యోసేపు నిజాలను అతడు పునరుద్ఘాటించెను. అయితే, యూదా యాకోబుకు తన చిన్న కుమారునిపై ఉన్న ప్రేమను వివరించి, ఐగుప్తు నుండి బెన్యామీను తన సహోదరులతో పాటుగా వెళ్లకపోతే తన తండ్రి ఖచ్చితముగా మరణించునని చెప్పెను. ఈ పరీక్షను బట్టి, ఆ సహోదరులు బెన్యామీను దోషి అనికాని లేక ఆ అసత్య ఆరోపణలు తమనందరిని ఇబ్బంది పెడుతున్నాయని కాని వారు నమ్మలేదని యోసేపు చూచెను. ఆ వెండి గిన్నె ఆ సంచిలోనికి ఎలా వచ్చెనని ఆలోచించకుండా, అతని పట్ల నిజమైన ఆందోళన మరియు ప్రేమగల వైఖరి వారిలో కనబడెను. ఒకవేళ వారి వైఖరి ఆ చిన్న సహోదరునిపై కఠినంగా మరియు క్షమించకుండా వుంటే, వారు యోసేపు నుండి లేక దేవుని[6] నుండి క్షమాపణ పొందడానికి అర్హులుకారు.

బెన్యామీనుకు యూదా భాద్యత వహించడములోని నిబద్ధత, యోసేపునకు ఆమోదయోగ్యమైన మరియు హృదయానికి హత్తుకున్న రుజువు. ఈ వ్యక్తే తన సహోదరులను యోసేపును వర్తకులకు అమ్మివేయడానికి ఒప్పించెను, అయినా ఇప్పుడు బెన్యామీనును యాకోబు ఇంటికి తిరిగి పంపుటకు తన పిల్లలను, తండ్రిని, మరియు కుటుంబమును విడిచి పెట్టి బానిసగా మారడానికి సిద్ధపడెను.

44వ అధ్యాయము ముగింపులో, యాకోబు మరియు అతని కుమారుల భవిష్యత్తు ఇంకా సందేహములో ఉంది; అయినప్పటికీ, ఆ కుటుంబము యొక్క సమస్యలు తర్వాత అధ్యాయములో స్పష్టం చేయబడెను. ఈ కథ భాగములో పశ్చాత్తాపము, క్షమాపణ, మరియు ఐగుప్తులో వారి భవిష్యత్తుకు నూతన అవకాశాల ద్వారాలు తెరువబడుట ఉండెను.

---

సూచనలు

[1]See E. A. Speiser, *Genesis*, The Anchor Bible, vol. 1 (Garden City, N.Y.: Doubleday & Co., 1964), 333. [2]David E. Aune, "Divination," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:971–74. [3]తర్వాత, మోషే ధర్మశాస్త్రము క్రింద, శకునము మరియు వివిధ ఇతర అన్య పద్ధతులు ఖచ్చితముగా నిషేధించబడినవి (లేవి. 19:26; ద్వితీ. 18:10; సంఖ్యా. 23:23 చూడుము) ఎందుకంటే అవి ప్రజలను పాడుచేసి దేవాది దేవుడైన ప్రభువు మీద విశ్వాసమునకు దూరము చేయును. [4]ఇశ్రాయేలీయుల వైఫల్యాలను కీర్తనలు 78 లో విస్తరించి చెప్పబడెను. [5]ఆ సహోదరులు యోసేపుకు సాష్టాంగనమస్కారం చేయడము మూడవసారి (42:6; 43:26, 28; 44:14), ఇది తన ప్రవచానత్మక కలలకు నెరవేర్పు (37:5-11). [6]కనికరములేని దాసుని ఉపమానము మత్తయి 18:21-35లో చూడుము.